సాక్షి చిత్తూరు

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



మానవత్వంతో ప్రజలకు సేవ

గ్రామీణ ప్రాంతాల్లో రక్త సేకరణకు మొబైల్ వాహనాన్ని కలెక్టర్ షణ్మోహన్ సోమవారం ప్రారంభించారు. - IIలో



వరసిద్ధుని సేవలో ప్రముఖులు

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామిని సోమవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	25
తిరుపతి	36	25
తిరుమల	32	21
గూడూరు	38	28
నగరి	37	26

న్యూస్‌రీల్

వరసిద్ధుని హుండీ లెక్కింపు



కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న మోహన్ రెడ్డి, వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి హుండీని సోమవారం ఆస్థాన మండపంలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు మాట్లాడుతూ 14 రోజులకు గాను స్వామివారికి కానుకల రూపంలో మొత్తం రూ.1.17కోట్లు వచ్చినట్లు వెల్లడించారు. అందులో 37 గ్రాముల బంగారం, 2.075 కిలోల వెండితోపాటు విదేశీ కరెన్సీ కూడా ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్ర బాబు, విద్యాసాగర్ రెడ్డి, హరి మాధవరెడ్డి, హేమమాలిని పాల్గొన్నారు.

‘సెబ్’ ఈఎస్‌గా బాబు శ్రీధర్



చిత్తూరు అర్బన్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ (ఈఎస్)గా కె.బాబు శ్రీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా నుంచి ఆయన బదిలీపై చిత్తూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీ రిషాంత్‌రెడ్డి, ఎస్ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం అర్బన్ సీఐ జోగేంద్ర, ఇతర అధికారులతో సమీక్షించారు.

పీవీకేఎన్‌లో యువ టూరిజం క్లబ్



క్లబ్ సర్టిఫికెట్ చూపుతున్న ఆర్జేడీ బాబు, ప్రిన్సిపల్ జీవనజ్యోతి

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువ టూరిజం క్లబ్ ఏర్పాటు చేసినట్లు ఉన్నత విద్య ఆర్జేడీ బాబు, ప్రిన్సిపల్ జీవనజ్యోతి తెలిపారు. సోమవారం పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్జేడీ మాట్లాడుతూ కేంద్ర పర్యాటక శాఖ వారు కళాశాలకు సర్టిఫికెట్ పంపడం గొప్ప విషయమన్నారు. దేశంలో పర్యాటక అవకాశాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వాన్ని, పర్యాటకంపై ఆసక్తి, అభిరుచిని పెంచుకోవడానికి టూరిజం క్లబ్ ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపల్ జీవనజ్యోతి మాట్లాడుతూ టూరిజం క్లబ్‌లో పాల్గొంటే టీం వర్క్, మేనేజ్‌మెంట్, లీడర్‌షిప్, సాఫ్ట్‌స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం సర్టిఫికెట్‌ను ఆర్జేడీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల యువ టూరిజం క్లబ్ కో–ఆర్డినేటర్ గోపీనాయక్, అకడమిక్ కో–ఆర్డినేటర్ భాను, అధ్యాపకులు మీరాసాహెబ్, శరవణ, జయచంద్రుడు పాల్గొన్నారు.

పేరెంట్స్ కమిటీ చైర్మన్లతో పతాకావిష్కరణ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం పేరెంట్స్ కమిటీ చైర్మన్ల చేతులమీదుగా జాతీయ జెండా ఆవిష్కరించాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు సోమవారం చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్ వెల్లడించారు. పేరెంట్ కమిటీ చైర్మన్ గైర్హాజరైతే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జెండా ఎగురవేయాలని సూచించారు.

ఉద్యమ యోధులు

- మహాత్ముని అడుగు జాడల్లో మహనీయులు
- స్వాతంత్ర్య సమరంలో మరపురాని గుర్తులు
- తెల్లదొరలపై తిరగబడిన చిత్తూరు గొంతుకలు

మహాత్మాగాంధీజీ స్ఫూర్తితో ముందుకు సాగారు.. ఆయన అడుగు జాడల్లో కదంతొక్కారు.. భరతమాత విముక్తే లక్ష్యంగా తమ గొంతుక వినిపించారు.. తెల్లదొరల నిరంకుశత్వంపై తిరగబడ్డారు.. లాఠీలకు బెదరకుండా నిబ్బరంగా నిలబడ్డారు.. స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలను లెక్కచేయకుండా పోరాటం సాగించారు.. నెలల తరబడి జైలు జీవితం గడిపారు. బ్రిటిషు పాలనకు వ్యతిరేకరంగా ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమంలో చిత్తూరు కీర్తిని సగర్వంగా చాటిన యోధులు శ్రీనివాస అయ్యంగార్, దురైస్వామి అయ్యంగార్‌ను గుర్తు చేసుకుంటూ ప్రత్యేక కథనం..

– చిత్తూరు రూరల్

చిత్తూరులో మహాత్ముని గుర్తులు

గాంధీజీ 1920 సెప్టెంబర్‌లో సహాయ నిరాకరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో దేశవ్యాప్తంగా పర్యటించారు. అప్పట్లో ఆంగ్లేయుల పాఠశాలలు, న్యాయస్థానాలు, కొలువులు, అన్నింటి నుంచి భారతీయులు వైదొలగాలని గాంధీజీ పిలుపునిచ్చారు. విదేశీ వస్త్రాలను బహిష్కరించి, ఖాదీని పోత్రహించాలని ఉద్యమాన్ని ఉరకలెత్తించిన తరుణంలో 1921, 1929న గాంధీజీ చిత్తూరుకు రెండు పర్యాయాలు వచ్చారు. గాంధీజీ వస్తున్నట్లు రైల్వేశాఖ తెలియజేయడంతో చిత్తూరు రైల్వే స్టేషన్‌కు జనం పోటెత్తారు. రైలు దిగిన గాంధీజీ బస్టాండు సమీపంలోని ఓ బంగ్లా (గతంలో అక్కడ బంగ్లా ఉండేది)కు చేరుకున్నారు. ఆ ప్రాంగణంలోని చెట్ల కింద కొంత సేపు విశ్రాంతి తీసుకున్నారు. ఆ తర్వాత చిత్తూరులో పర్యటించారు. కోర్టు ఎదురుగా ఉన్న రోడ్డు మీదుగా జెండామాను వీధికి చేరుకున్నారు. దీంతో ఆ మార్గం గాంధీరోడ్డుగా వాడుకలోకి వచ్చిందని పెద్దలు చెబుతుంటారు.



గాంధీజీ పిలుపుతో...



చిత్తూరు నగరానికి చెందిన డి. శ్రీనివాస అయ్యంగార్ 1905లో జన్మించారు. జెండామాను వీధిలో పుట్టి పెరిగిన ఆయన డిగ్రీ పూర్తి చేసుకుని 1926 సంవత్సరం మద్రాసు(చెన్నై)లో న్యాయ విద్యను పూర్తి చేసుకుని రాయలసీమలో ప్రముఖ న్యాయవాదిగా పేరు పొందారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా కమిటీ కార్యదర్శిగా గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్య సమరంలోకి అడుగుపెట్టారు. 1940–1943 మధ్య కాలంలో క్విట్ ఇండియా ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం ప్రారంభమైనప్పుడు కుప్పంలో ఉద్యమ సభను ఏర్పాటు చేశారు. ఆ సమావేశానికి పెద్దసంఖ్యలో జనం హాజరైనా.. వేదికపై మాట్లాడేవారు లేరు. వేదిక ఎక్కితే అరెస్ట్ చేస్తారని భయపడి అందరూ కిందే నిలుచున్నారు. బ్రిటిష్ వారి హెచ్చరికలను లెక్క చేయని శ్రీనివాస అయ్యంగార్ సభలో తన గొంతుక వినిపించారు. ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. దీంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. మూడేళ్ల జైలు జీవితంలో పలువురు స్వాతంత్ర్య సమర యోధులతో ఆయనకు పరిచయం ఏర్పడింది. రాజగోపాలాచారి, వీవీ గిరి, నిజలింగప్ప, వెంకటరామన్, నీలం సంజీవరెడ్డి తదితరులను కలిశారు. అంతకు ముందు కూడా పలుమార్లు జైలు కెళ్లారు. ఆ సమయంలో లాఠీ దెబ్బలను సైతం చవిచూశారు. 2003 జూలై 18వ తేది తన స్వగృహంలోనే తుది శ్వాస విడిచారు.

దురైస్వామి పేరుతో డీఐ రోడ్డు



చిత్తూరు బ్రాహ్మణవీధికి చెందిన చేట్లూరు దురైస్వామి అయ్యంగార్ స్వాతంత్ర్య ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేశారు. ఆయనకు ఆంగ్లంలో మంచి పట్టు, విద్యపై ఆసక్తి ఉండడంతో 1898లో న్యాయవాద వృత్తిని చేపట్టారు. ప్రముఖ న్యాయవాదిగా రాణిస్తూ మహాత్ముడి పిలుపుతో స్వాతంత్ర్య సమరంలోకి అడుగుపెట్టారు. 1921లో గాంధీజీ చిత్తూరు పర్యటనకు విచ్చేశారు. అప్పుడు దురైస్వామి ఇంట్లోనే బస చేశారు. అందుకు గుర్తుగా దురైస్వామి తన రెండో కుమారుడికి శ్రీనివాస గాంధీ అని పేరు పెట్టుకున్నారు. 1927 నుంచి 1934 వరకు రాయలసీమ ప్రాంతానికి సెంట్రల్ ఎమ్మెల్యే (ప్రస్తుతం ఎంపీ)ఒకరే ఉండేవారు. 1927లో జరిగిన ఎన్నికల్లో జస్టిస్ పార్టీ అభ్యర్థిపై కాంగ్రెస్ సెంట్రల్ ఎమ్మెల్యేగా దురైస్వామి అయ్యంగార్ ఎంపికయ్యారు. తెల్లదొరల నిరంకుశ పాలనను నిర్భయంగా విమర్శించారు. దురైస్వామి జ్ఞాపకార్థకంగా చిత్తూరులోని ఓ వీధికి దురైస్వామి అయ్యంగార్(డీఐ రోడ్డు) పేరు పెట్టారు. విధివశాత్తు ఆయన 1937లోనే కన్నుమూశారు.

తుడా చైర్మన్‌గా
చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- మూడేళ్ల పాటు పదవిలో
- ఇక అధికార హోదాతో ప్రజల్లోకి..



తిరుపతి రూరల్/తిరుపతి తుడా: వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని మరింతగా ప్రజలకు చేరువచేసేందుకు, మరిన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించేలా ప్రోత్సాహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(తుడా) చైర్మన్‌గా చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని నియమించారు. ఆమేరకు సోమవారం ప్రత్యేక జీవోను విడుదల చేశారు. మూడేళ్ల పాటు మోహిత్‌రెడ్డి ఈ పదవిలో ఉంటారు.

అధికార హోదాలో ప్రజల వద్దకు..

సౌమ్యుడుగా, వివాదరహితుడుగా చంద్రగిరి నియోజకవర్గంలో దాదాపు 108 సచివాలయాల పరిధిలో 2,266 పల్లెల్లో 1600 కిలోమీటర్ల మేర మోహిత్ రెడ్డి పాదయాత్ర చేస్తున్నారు. ప్రజలతో మమేకం అవుతూ, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్కడి అక్కడే పరిష్కరించేలా చొరవచూపుతున్నారు. పలు సమస్యలకు నిధుల కొరత ఉంటే అధికారుల నుంచి ప్రతిపాదనలు తీసుకుని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులను మంజూరు చేయిస్తూ వాటిని పరిష్కరిస్తూ ప్రజల మన్నలను పొందుతున్నారు. ఈనేపథ్యంలో ఎలాంటి ప్రొటోకాల్ లేకుండా నియోజకవర్గ వ్యాప్తంగా మోహిత్‌రెడ్డి ఎలా పర్యటిస్తారని, నిధుల మంజూరు, సమస్యల పరిష్కారం ఎలా చేస్తారని టీడీపీ శ్రేణులు కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశాయి. మోహిత్‌రెడ్డి పర్యటనల్లో అధికారులు ఎలా పాల్గొంటారని, మీడియా సమావేశాలు పెట్టి మరీ విమర్శలు చేశారు. ప్రొటోకాల్ లేకుండా చంద్రగిరి ప్రజల వద్దకు అధికారులతో కలిసి ప్రజల వద్దకు వెళ్లడంపై ప్రతిపక్షాల చేసిన విమర్శలు, ఫిర్యాదులు ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లాయి. మోహిత్‌రెడ్డిని మరింత ప్రోత్సాహించేందుకు నిర్ణయించుకున్న ముఖ్యమంత్రి, ప్రతి నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు పాదయాత్ర చేస్తూ ప్రజల్లో ఉంటున్న మోహిత్‌రెడ్డి, ప్రజా సమస్యలు విని, వాటిని అధికారులతో చర్చించి పరిష్కరించేలా అధికార హోదాను కల్పించాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో మోహిత్‌రెడ్డిని తుడా చైర్మన్‌గా నియమించారు. ముఖ్యమంత్రి నిర్ణయంతో ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికార హోదాలో పాల్గొనేందుకు, అధికారులతో చర్చించి ప్రజలకు మరింత మేలు చేసేందుకు మోహిత్‌రెడ్డికి అవకాశం దక్కిందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాయి.

‘చెబుదాం’ అర్జీలకు సత్వర పరిష్కారం

చిత్తూరు కలెక్టరేట్ : జగనన్నకు చెబుదాంలో నమోదయ్యే అర్జీలను 48 గంటల్లోపు సత్వరమే పరిష్కరించాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,233 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హైస్కూళ్లలో తాగునీటి కొళాయిలను పరిశీలించాలని డిజిటల్ అసిస్టెంట్లను ఆదేశించారు. జిల్లాలో అసైన్డ్ భూములు పంపిణీకి అర్హులను గుర్తించాలని స్పష్టం చేశారు. రేషన్ బియ్యం అమ్ముకుంటే కార్డులు రద్దు చేయాలని సూచించారు. మంగళవారం ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయాలని కోరారు. సమీక్షలో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి , డిప్యూటీ కలెక్టర్ గంగాభవానీ, జిల్లా అధికారులు ఉమాదేవి, గంగాభవానీ పాల్గొన్నారు.

అభివృద్ధే మా అజెండా

- ఓట్ల కోసం చేసే విమర్శలను పట్టించుకోం
- ప్రజల ఆశీస్సులతోనే విజయాలు సాధిస్తున్నాం
- ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, వేదికపై మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్ తదితరులు

పుంగనూరు : కన్నతల్లిలాంటి పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధే అజెండాగా పనిచేస్తున్నామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలో పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్రమణ్యం యాదవ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ యాదవ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. శ్రీకృష్ణుడికి పూజలు చేశారు. అనంతరం ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతోనే తమ కుటుంబానికి ఇన్ని విజయాలు దక్కుతున్నాయన్నారు. తమను ఈ స్థాయికి తీసుకొచ్చిన పుంగనూరు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉన్నామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రతి సారీ ఎన్నికల సమయంలో ఎవరో ఒకరు వచ్చి ఓట్లకోసం గుప్పించే విమర్శలను పట్టించుకోమని వెల్లడించారు. తమ కుటుంబానికి ఉన్నత పదవులు అందించేందుకు ప్రతి ఎన్నికల్లో గెలిపించిన ప్రజల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని వివరించారు. సమావేశంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు జ్ఞానప్రసన్న, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న నేతలు

ఆత్మీయ సభ సక్సెస్

వైఎస్సార్‌సీపీ యాదవ ఆత్మీయ సమావేశానికి పెద్ద సంఖ్యలో యాదవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మాట్లాడుతూ యాదవులకు రాజకీయ పదవులు ఇచ్చిన ముఖ్యమంత్రి జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ పెద్దిరెడ్డి కుటుంబం బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తోందన్నారు. 28 ఏళ్లకే తనను ఎమ్మెల్యేను చేసిన ఘనత పెద్దిరెడ్డి కుటుంబానిదేనని కొనియాడారు. యాదవ సంఘం కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల వేళ ఒక బఫూన్ వచ్చి కులం పేరుతో మోసగిస్తున్నాడని ఆరోపించారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న తిరుమల గొల్ల సన్నిధి సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించారని తెలిపారు. 800 దేశీయ ఆవులను మిథున్‌రెడ్డి పెంచుతున్నారని, దీంతో యాదవులపై ఉన్న ప్రేమ తెలుస్తోందని చెప్పారు. యాదవ సంఘ ప్రతినిధులు వాణిలక్ష్మీ, చంద్రారెడ్డి యాదవ్, నరసింహులు, జయకుమార్ యాదవ్, సుబ్బన్న, రమణ, శంకరప్ప, నారాయణ రెడ్డి, పాపిరెడ్డి, పురుషోత్తం , గౌరమ్మ, గంగిరెడ్డి, ప్రభాకర్ యాదవ్, హరి యాదవ్, రెడ్డెప్ప యాదవ్, నరసింహరెడ్డి యాదవ్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సంబరాలకు సర్వం సిద్ధం



కవాతు చేస్తున్న పోలీసులు



పోలీస్ పరేడ్ మైదానంలో గౌరవవందనం స్వీకరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మంగళవారం ప్రశాంత్ నగర్ లోని ఎస్పీ కార్యాలయం వద్ద పరేడ్ మైదానంలో సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వేడుకలకు జిల్లా ఇంచార్జి మంత్రి ఉషశ్రీ చరణ్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డిలు సోమవారం పరేడ్ మైదానంలో రిహార్సల్స్‌ను పరిశీలించారు. పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని వివిధ శాఖల్లో ఉత్తమ పనితీరు కనబరచిన సుమారు 125 మందికి ప్రశంసాపత్రాలను ఇవ్వనున్నారు. అలాగే వివిధ శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. పలు పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఏర్పాట్లు పరిశీలనలో జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓ రేణుక, మున్సిపల్ కమిషనర్ అరుణ, తహసీల్దార్ మురళి పాల్గొన్నారు.

షెడ్యూల్ ఇలా....

- ఉదయం 9.05 గంటలకు జిల్లా ఇంచార్జి మంత్రి ఉషశ్రీ చరణ్ వస్తారు.
- 9.10 గంటలకు గౌరవ వందనం స్వీకరణ, పోలీసు పరేడ్
- 9.25 గంటలకు మంత్రి సందేశం
- 9.40 గంటలకు పోలీసు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ బృందాల కవాతు
- 10 గంటలకు శకటాల ప్రదర్శన
- 10.30 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు
- 11 గంటలకు ఉత్తమ సేవా పురస్కారాల ప్రదానం
- 12 గంటలకు జాతీయగీతాలాపనతో వేడుకల ముగింపు

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,401 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి హుండీ ద్వారా రూ.3.76 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

సమగ్ర సమాచారంతో ‘భరోసా’

గుడిపాల: రైతు భరోసా కేంద్రాల్లో రైతుల జాబితా, పంటల వివరాలు సమగ్రంగా అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా ప్రత్యేకాధికారి వీరపాండియన్ ఆదేశించారు. సోమవారం మండలంలో ఆయన పర్యటించారు. బొమ్మసముద్రం పాఠశాలలో చేపట్టిన నాడు–నేడు పనుల పురోగతిని ఆరా తీశారు. మధ్యాహ్నభోజనాన్ని తనిఖీ చేశారు.197రామాపురం అంగన్‌వాడీ కేంద్రంలోని గర్భిణులు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కృష్ణజమ్మాపురంలో భూముల రీసర్వేను పరిశీలించారు. తుమ్మలవారిపల్లె వద్ద జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. 197 రామాపురం, కుప్పిగానిపల్లె, వసంతాపురంలోని రైతుభరోసా కేంద్రం, సచివాలయం, వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా అత్యున్నతమైన సేవలు అందిస్తున్నామన్నారు. ఈ క్రమంలో రైతులు పొందుతున్న సేవలు, పంటల సమాచారం, రాయితీల వివరాలను అందరికీ తెలిసేలా ప్రదర్శించాలని సూచించారు. యంత్రసేవా ద్వారా వివిధ రకాల పరికరాలు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. వాటి వివరాలను డిస్‌ప్లే చేయాలని కోరారు. పీఎం కిసాన్, రైతుభరోసా ఎంతమందికి అందింది అని ఆరా తీశారు. ఎరువుల రికార్డులను తనిఖీ చేశారు. వసంతాపురంలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. పశువులకు అందిస్తున్న వైద్య సేవలు, పాల సేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రేణుక, డీఎల్‌డీఓ రవికుమార్, తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచులు జనార్దన్, రజినీకాంత్, ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, ఏఓ మాధవి, రీసర్వే డీటీ వంశీకృష, ఏఈలు హేమంత్, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.



ఆర్‌బీకేలో కియోస్క్ మిషన్‌ను పరిశీలిస్తున్న వీరపాండియన్

మానవత్వంతో ప్రజలకు సేవ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజలకు మానవత్వంతో సేవలందించాలని కలెక్టర్ షణ్మోహన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ రక్త సేకరణ మొబైల్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణుల నుంచి రక్త సేకరణకు ఆధునిక వసతులతో కూడిన మొబైల్ వాహనం ఉపయోగపడుతుందన్నారు. ఇందులో రక్త యూనిట్లు నిల్వచేసుకునే వెసులుబాటు, దాతలకు అవసరమైన అన్ని సదుపాయాలు వాహనంలో ఉన్నట్లు సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు గోవర్ధన్, సభ్యులు రఘుపతి, రెడ్డెప్ప పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో ప్రముఖులు


జస్టిస్ సుజాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని సోమవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత, డీఎఫ్ఓ చైతన్య కుమార్ రెడ్డి, వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులచే ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. కార్యక్రమంలో ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ రంగస్వామి, సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తుల భద్రతపైనే 'ఫోకస్'

- ఓ వైపు అటవీశాఖ.. మరో వైపు టీటీడీ
- సంపూర్ణ రక్షణకు ప్రణాళిక రూపకల్పన
- క్రూర మృగాల కదలికలపై నిఘా
- తిరుపతిలో హైలెవల్ కమిటీ సమావేశం


సమీక్షిస్తున్న టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, జేఈఓ సదాభార్గవి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

సాక్షి, తిరుపతి : భక్తుల భద్రతే లక్ష్యంగా టీటీడీ, అటవీ అధికారులు ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఫోకస్ లైట్లు, కెమెరాలు వంటివి విస్తృతంగా ఏర్పాటు చేయనున్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల ప్రాణాలకు ఎటువంటి ఆపదా తలెత్తకుండా చర్యలు చేపట్టారు. చిన్నారి లక్షిత మృతితో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షతన సోమవారం హైలెవల్ కమిటీ సమావేశం నిర్వహించారు. మరో వైపు అటవీశాఖ అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ శాంతిప్రియ పాండే ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఇంకో వైపు టీటీడీ పోలీసుశాఖ అధికారులతో సమావేశమైంది. ఆ తరువాత టీటీడీ, అటవీశాఖ అధికారులు కలిసి సమావేశమయ్యారు. నెలన్నర క్రితం నడక దారిలో ఆరేళ్ల బాలుడు కౌశిక్‌పైనా, రెండు రోజుల క్రితం లక్షితపైనా చిరుత దాడి చేయడానికి గల కారణాలు, నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సుదీర్ఘంగా చర్చించారు. భవిష్యత్తులో కాలినడకన, ఘాట్ రోడ్డులో వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉమ్మడిగా ప్రణాళికలు రూపొందించారు. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గంలో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే అనుమతి ఇచ్చారు. ఆ తర్వాత చిన్నపిల్లలకు అనుమతి ఉండదు. పెద్దలకు మాత్రం రాత్రి పది గంటల వరకు అనుమతి ఉంటుంది. నడక మార్గంలో వెళ్లే ప్రతి భక్తుడికి ఊతకర్ర చేతికి ఇచ్చి పంపాలని నిర్ణయం తీసుకున్నారు. అలిపిరి నుంచి ఘాట్ రోడ్డులో వెళ్లే ద్విచక్ర వాహనదారులకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకే అనుమతి ఉంటుంది.

భారీ ఎత్తున భద్రతా ఏర్పాట్లు

భక్తుల భద్రత దష్ట్యా టీటీడీ, అటవీ శాఖ భారీ ఎత్తున భద్రతా సిబ్బందిని నియమించాలని నిర్ణయం తీసుకున్నాయి. ట్రాప్ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు ఉపయోగించనున్నారు. నడక దారిలో అవసరమైతే ఫోకస్ లైట్స్‌ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలిపిరి, ఏడవ మైలు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. ఇంకా బేస్ క్యాంపులు, సెక్యూరిటీ సిబ్బందిని నియమించనున్నారు. అందులో భాగంగా నడక మార్గంలో భక్తులను గుంపులుగా పంపే ఏర్పాట్లు ప్రారంభించారు. నడక, ఘాట్ రోడ్డులో జంతువులకు తినుబండారాలు ఇవ్వకుండా చర్యలు చేపట్టారు. నడక మార్గంలో భక్తులకు ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే చికిత్స అందించేందుకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తారు.

అప్రమత్తమైన భక్తులు

చిన్నారి లక్షిత మృతితో తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు అప్రమత్తమయ్యారు. గుంపులు గుంపులుగా వెళ్లేందుకే ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల తల్లిదండ్రులు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొందరు పిల్లల చేతికి లేదా నడుముకు తాడు కట్టి, ఆ తాడును తన చేతితో పట్టుకువెళుతున్నారు. మరి కొందరు తల్లిదండ్రులు చిన్నారులను భుజంపై ఎక్కించుకుని తీసుకెళ్లడం కనిపించింది. చీకటి పడ్డాక నడక మార్గంలో వెళ్లటానికి భక్తులు ఇష్టపడటం లేదు. చీకటి పడక ముందే తిరుమల చేరుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

క్రూర మృగాల కదలికలపై నిఘా

శేషాచలం అడవిలో క్రూర మృగాల కదలికలపై అటవీశాఖ అధికారులు పూర్తిస్థాయిలో నిఘా పెట్టారు. టీటీడీ సహకారంతో అటవీ ప్రాంతంలో మొత్తం ఎన్ని చిరుత, ఎలుగుబంటి, రేసుకుక్కలు ఉన్నాయో తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అందు కోసం సీసీ కెమెరాలు, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంకా క్రూర మృగాల అడుగులను గుర్తించి లెక్కించే పనిలో పడ్డారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న అధికారులు

చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలం బలిజపల్లె వద్ద కర్ణాటక మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని ఎస్ఈబీ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. సుబ్రమణ్యం (47) అనే వ్యక్తి బైక్‌పై మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి 96 కర్ణాటక మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. బైక్ సీజ్ చేశారు. దాడిలో ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు..


నిందితుడు మణి

రొంపిచెర్ల: రొంపిచెర్ల క్రాస్‌రోడ్డులో శ్రీనివాసులు అనే వ్యక్తి నిర్మించుకుంటున్న ఇంట్లో షెంట్రింగ్ షీట్లు చోరీ చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. మే 23వ తేదీన జరిగిన చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా వేలిముద్రల సాయంతో తిరుపతి జీవకోనకు చెందిన మణి(29)ని నిందితుడిగా గుర్తించామన్నారు. మణిపై ఇప్పటికే తిరుపతి అలిపిరి పీఎస్‌లో 10 కేసులు, తిరుచానూరులో 1 కేసు ఉందని వివరించారు. నిందితుడిని పీలేరు కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

'స్పందన' వినతులకు ప్రాధాన్యం


అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శ్రీనివాసులు


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజలు వినతుల ద్వారా తెలియజేసే సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమివ్వాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలుఅర్జీలు అందజేశారు. జేసీ మాట్లాడుతూ స్పందనలో నమోదయ్యే వినతులను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందనలో మొత్తం 238 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్ఓ రాజశేఖర్ ల్గొన్నారు.

అర్జీలపై అలసత్వం వద్దు

చిత్తూరు అర్బన్: స్పందనలో వచ్చే అర్జీలపై అలసత్వం వద్దని, వాటి పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం చిత్తూరులోని ఏఆర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఎస్ఐలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వినతులపై సమీక్షించారు. ఏఎస్పీ సుధాకర్, ఎస్ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మి సైతం ప్రజల నుంచి ఫిర్యాదు స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి


చరిత మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ (ఇన్‌సెట్) చరిత (ఫైల్)

పలమనేరు : బెంగళూరులోని హెళవంక వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో పలమనేరుకు చెందిన చరిత(19) అనే విద్యార్థిని మృతి చెందింది. వివరాలు.. ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ చదువుతున్న చరిత పంద్రాగస్టు వేడుకల కోసం సామగ్రిని కొనుగోలు చేసేందుకు క్లాస్‌మేట్‌తో కలిసి బైక్‌పై వెళుతుండగా టాటా ఏస్ ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ తోట శ్రీనివాసులు కుమార్తె అయిన చరిత మృతదేహాన్ని సోమవారం పట్టణంలోని నివాసానికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సీఐ చంద్రశేఖర్ తదితరులు విద్యార్థిని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ముగ్గురు సర్పంచ్‌లు..37 మంది సభ్యులు ఏకగ్రీవం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఖాళీగా ఉన్న 3 సర్పంచ్, 46 వార్డు సభ్యుల స్థానాలకు గాను ముగ్గురు సర్పంచ్‌లు, 37 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు డీపీఓ లక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ జీడీనెల్లూరు మండలం నెల్లేపల్లె పంచాయతీ సర్పంచ్‌గా కె.గంగయ్య, కార్వేటినగరం మండలం కత్తెరపల్లె సర్పంచ్‌గా నవీన, విజయపురం మండలం కాళికాపురం సర్పంచ్‌గా సెల్వి ఎన్నికైనట్లు వెల్లడించారు. మిగిలిన 9 వార్డుల్లో 2 వార్డులకు ఎవరూ నామినేషన్ వేయలేదని, 7 వార్డులకు గాను ఈ నెల19వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు.

విద్యార్థిని ఆత్మహత్య


దివ్య మృతదేహం

గుడుపల్లె : పాఠశాలకు సక్రమంగా వెళ్లడంలేదని నానమ్మ మందలించడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థిని సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. మండలంలోని బండకొత్తూరుకు చెందిన ప్రకాష్, శోభ దంపతులు బెంగళూరులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పనిచేస్తున్నారు. వారికి కుమారుడు నాగార్జున, కుమార్తె దివ్య(15) ఉన్నారు. స్వగ్రామంలోని నానమ్మ గంగమ్మ ఇంట్లోనే దివ్య ఉంటూ బెగ్గిలిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. కొంతకాలంగా దివ్య చెప్పిన మాట వినకపోవడం, పాఠశాలకు వెళ్లకపోవడంతో నానమ్మ మందలించింది. దీంతో దివ్య పాఠశాలకు బయలుదేరి, గ్రామ సమీపంలోని చింత చెట్టుకు చున్నీతో ఉరేసుకుంది. స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీయూలో చిరుత కలకలం

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విభాగం సమీపంలోని పొదల్లో చిరుత సోమవారం రాత్రి సంచరించడం విద్యార్థుల కంటపడింది. వెంటనే విద్యార్థులు కేకలు వేయడంతో వేదిక్ యూనివర్సిటీ సమీపంలోని అటవీ ప్రాంతం వైపు వెళ్లిందని ఇంజినీరింగ్ హాస్టల్ విద్యార్థులు పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన ఎస్వీయూ పోలీస్‌స్టేషన్ సిబ్బంది సమీప ప్రాంతానికి చేరుకుని శబ్దాలు చేస్తూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్ హాస్టల్ సమీపం గ్రౌండ్‌లోని అటవీ ప్రాంతంలో చిరుత తారసపడిందని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. అనంతరం అక్కడి విద్యార్థులకు చిరుత సంచరించే ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో తిరగరాదని సూచించారు.

108 ఢీకొని వృద్ధుడికి గాయాలు


క్షతగాత్రుడికి చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

ఐరాల: మండలంలోని చింతగుబ్బలపల్లె వద్ద సోమవారం 108 వాహనం ఢీకొని ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ శ్రీనివాసరావు కథనం మేరకు.. మండలంలోని కురప్పపల్లెకు చెందిన కృష్ణయ్యగౌడ్ (69) ద్విచక్రవాహనంలో వైఎస్ గేటుకు వచ్చాడు. తిరుగుప్రయాణంలో ఉండగా చిత్తూరు నుంచి ఐరాలకు వస్తున్న 108 వాహనం ఢీకొంది. క్షతగాత్రుడికి 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం వేరే 108 వాహనంలో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి కుమారుడు వాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోటాపోటీగా క్రికెట్ పోటీలు

వెంకటగిరి రూరల్ : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక తారకరామ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న సౌత్‌జోన్ అండర్-16 క్రికెట్ పోటీల్లో భాగంగా సోమవారం అనంతపురం-చిత్తూరు, కడప-నెల్లూరు జట్ల మధ్య క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. గ్రౌండ్-1లో అనంతపురం- చిత్తూరు జట్ల మధ్య జరిగిన క్రికెట్ పోటీల్లో అనంతపురం జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన జట్టు 40.4 ఓవర్లకు 138 పరుగులు చేసింది. ఈ జట్టులో భువనేశ్వర్ 31 పరుగులు తీయగా చిత్తూరు జట్టు బౌలింగ్‌లో ప్రకాష్ 4, సోహాన్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 47 ఓవర్లకు 133 పరుగులు తీసింది. ఈ జట్టులో నవీన్‌ధీర్ 58, ప్రసాద్ 45 పరుగులు తీసి నాటౌట్‌గా నిలిచారు. అనంతపురం జట్టుకన్నా చిత్తూరు జట్టు 5 పరుగుల తేడాలో వెనుకంజలో ఉంది.

గ్రౌండ్-2లో...

కడప-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 50 ఓవర్లకు 199 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఈ జట్టులో గురువిఘేష్ 66, నాగ కొల్లప్పా 35 పరుగులు తీశారు. నెల్లూరు జట్టు బౌలింగ్ విభాగంలో హరివరన్ 6 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 43 ఓవర్లకు 125 పరుగులు చేసి 1 వికెట్ కోల్పోయింది. ఈ జట్టులో ప్రసాద్ 64, విష్ణువిశాల్ 35 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. కడప జట్టుకంటే నెల్లూరు జట్టు 54 పరుగులు తేడాతో వెనుకంజలో ఉంది. ఈ మ్యాచ్‌ల కో-స్కోరర్‌గా సీడీ శ్రీనివాసులరెడ్డి వ్యవహరించారు.

తిరుమల ఘాట్‌లో ప్రమాదం

తిరుమల: తిరుమల నుంచి తిరుపతికి వచ్చే మొదటి ఘాట్ రోడ్‌లో ఆదివారం ప్రమాదం చోటుచేసుకుంది. కర్ణాటకకు చెందిన కారు అదుపుతప్పి 17వ కిలోమీటర్ వద్ద పిట్ట గోడను ఢీకొంది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలుకాలేదు. వెంటనే ఘాట్ రోడ్డు సిబ్బంది వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మరుగుదొడ్డిలో కాలుజారి పడి యువకుడి మృతి

శ్రీకాళహస్తి: మరుగుదొడ్డిలో యువకుడు కాలుజారి పడి మృతి చెందిన సంఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన సందీప్‌కుమార్(26) సొంత పనుల నిమిత్తం సోమవారం శ్రీకాళహస్తికి వచ్చాడు. ఆర్టీసీ బస్టాండులోని మరుగుదొడ్డిలోకి వెళ్లి కాలుజారి పడ్డాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.